
మతపెద్దలతో కలిసి గ్యార్వీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి గ్యార్వీ ఉత్సవాలు ప్రతీక అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జహంగీర్, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్‌గౌస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ శాంతి ర్యాలీ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావు, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు మోహిన్, ఎం.డి.షాషేద్, శివముదిరాజ్, భిక్షపతియాదవ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు రాష్ట్ర బృందం నాయకుడిగా చిన్నబాబు



నల్లకుంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరుగనున్న 27వ జాతీయ యువజనోత్సవాలకు రాష్ట్రం నుంచి పాల్గొనే యువజన బృందానికి నాయకుడిగా నగరంలోని విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జె.చిన్నబాబు ఎంపికయ్యారు. ఈ బృందంలో వివిధ యూనివర్సిటీల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 30మంది పాల్గొంటున్నారు. ఈనెల 12నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి పాల్గొనే మహిళా వలంటీర్ల బృందానికి నల్గొండ మహిళా కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి.జ్యోతి నాయకత్వం వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ జి.సుకన్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ ఎస్.రవిప్రసాద్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జె.చిన్నబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు గుర్రం చంద్రకళశంకర్ హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్, బింగినవీన్‌కుమార్, పున్న సత్యనారాయణ, మల్లికార్జున శివకుమార్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, కాంగ్రెస్ నేత గుర్రం శంకర్, చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కా దేవదాసు, గణపతి దేవాలయం మాజీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, డా.రూప, నాయకులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బాలికల ఆత్మరక్షణ కోసం ఈనెల 20, 21 తేదీల్లో ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో పదేళ్ల పై బడిన బాలికలు, యువతులు, మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీలను ఎల్.బి.స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు నర్సింగ్‌రావు, శేఖర్, పోచయ్య, తిరుపతి, పూర్ణచందర్, రవికుమార్, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అంజనేయులు, శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎస్ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

నేడు మాదిగల భవిష్యత్ కార్యాచరణ

● టీఎస్ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మాదిగల భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్రస్థాయి సమావేశాన్ని నగరంలో సోమవారం నిర్వహించనున్నట్లు టీఎస్ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అణగారిన వర్గాలు అత్యధిక జనాభా కలిగిన పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులు అరకొర నిధులతో చాలీచాలని జీతాలతో జీవితాలను వెళ్లదీస్తూ భద్రత లేకుండా జీవిస్తున్నారని అన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి వారిని పర్మినెంట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేష్, బల్గర్ హాస్సేన్, యాదన్న డప్పు, శివరాజ్ పాల్గొన్నారు.

లోతైన అధ్యయనంతో రచనలు చేయాలి

● ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్


ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్

బర్కత్‌పుర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రచయితలు నిరంతరం ప్రజల మ ధ్య ఉండి రచనలు చేయాలని ప్రముఖ రచయిత నిఖిలేశ్వర్ అన్నారు. పబ్లిసిటీ పురస్కారాల కోసం రచనలు చేయకుండా లోతైన అధ్యయనంతో రచనలు చేయాల్సిన అవసరం యువ రచయితలపై ఉందన్నారు. సామాజిక మానవ అనుబంధాలు, పోరాట పటిమ, శాస్త్రీయమైన సామాజిక అవగాహన, వ్యాసాలను విశ్లేషించే తపన తనను సాహిత్యపరంగా ముందుకు నడిపించాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో అంతర్‌వాణి శీర్షికన నిఖిలేశ్వర్ సాహిత్య, జీవన ప్రయాణంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన జీవితంలోని సాహిత్య అనుభవాలను విప్లవ కవిగా, హేతువాదిగా మార్చిన సంఘటనలను వివరించారు. ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ రచయిత నిఖిలేశ్వర్‌ను తనతో పాటు ఎందరో సాహితీప్రియులు ఆదర్శంగా తీసుకుని రచనలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

గోల్నాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవయే మాధవ సేవగా పేదలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని ప్రముఖ సంఘసేవకురాలు, అంబేద్కర్ కళాశాల చైర్మన్ జి.సరోజ వివేక్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డ హర్రాస్‌పెంటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ శ్మశానవాటిక ప్రబంధక కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రచయిత్రి రాధిక కృష్ణ, డాక్టర్ రమాదేవి, ప్రతినిధులు రాజ్‌కుమార్‌విగ్, రాజేందర్‌పటేల్, వీరాస్వామి, విజయకుమార్, సాయిగిరిధర్, బి.కృష్ణాగౌడ్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, నందకిషోర్‌యాదవ్, డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, శివకుమార్, యాదయ్య పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, తదితరులు


ముగ్గును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ కె.రవి చారి, బీఆర్ఎస్ నాయకుడు ఎం.నాగేష్ తదితరులు


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ముచ్చట గొల్పిన ముగ్గులు

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన

(ముషీరాబాద్ - జోన్‌బృందం) : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ : స్వర్గసీమ సుకేతనల) ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 75 మంది మహిళలు పోటాపోటీగా రంగురంగుల ముగ్గులు వేశారు. సంక్రాంతి పండగ ఉట్టిపడేలా బొగ్గమ్మలు, చెరుకుగడలు, గంగిరెద్దులు, పతంగులు, నారదముని, వెన్నకొండలు తదితర దేవతామూర్తుల ప్రతిమలు పూలతో ముగ్గులను చూడముచ్చటగా అలంకరించారు. చుక్కల ముగ్గులతో సంక్రాంతి పండగ ఉట్టిపడేలా ముగ్గులు వేసి ఔరా అనిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జీహెచ్ఎంసీ సర్కిల్ 15 డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ పీఎస్ సీఐ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, కె.రవిచారి, పావని వినయ్‌కుమార్, డీపీవో సుధాకర్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రఫుల్ రాంరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్, కె.మాధవ్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బద్రి నారాయణ తదితరులు హాజరయ్యారు. ముగ్గులను పరిశీలించి విజేతలకు మొదటి బహుమతి రూ. 6వేలు, ద్వితీయ బహుమతి రూ. 4వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలతో పాటు మూడు కన్సోలేషన్ ప్రైజ్‌లు అందజేశారు. అలాగే ఆసక్తితో ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి ప్రోత్సాహకరమైన బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతలు ప్రసన్న, పద్మజారెడ్డి, శైలజలు ఈ ముత్యాల ముగ్గుల పోటీలో విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి సీనియర్ సబ్ ఎడిటర్ జన్ను రమేష్, స్టాఫ్ రిపోర్టర్ చందు, చిక్కడపల్లి జోన్ ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, విలేకరులు కనకరాజ్, సతీష్, చారి, బాలకృష్ణ, లక్ష్మణ్, హన్స్‌రాజ్, సురేష్‌కుమార్, ఫొటోగ్రాఫర్ రహీం, యాడ్స్ జోన్ ఇన్‌చార్జి అంజిరెడ్డి, సర్క్యులేషన్ జోన్ ఇన్‌చార్జి శ్రీకాంత్, హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేసేందుకు ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ప్రతియేటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని డీఎంసీ తిప్పర్తి యాదయ్య, సీఐ వెంకటరెడ్డి, కటరెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, కె.రవిచారి, పావని వినయ్‌కుమార్ అన్నారు. నేటి యాంత్రిక యుగంలో అంతరించిపోతున్న మన సంస్కృతిని ఆంధ్రజ్యోతి కాపాడుతుందన్నారు. ఇంటి ముందు వేసే ముగ్గులు ఇంటికి శోభనీయడంతో క్రిమికీటకాలు లోపలికి రాకుండా కాపాడుతాయని వారన్నారు. నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

కెనరా బ్యాంక్ / केनरा बैंक / Canara Bank
A Government of India Undertaking
Together We Can
ఆంధ్రజ్యోతి
ABN
AIMS INSTITUTES
Peenya, Bangalore
EMPOWERING MINDS
AIMS Admissions Centre
+91 81500 01994
SWARGASEEMA SUKETANA
Ph: + 91 98490 12500


ముగ్గు వేస్తున్న ప్రథమ బహుమతి విజేత ఇందూరి వనజ


ముగ్గు వేస్తున్న ద్వితీయ బహుమతి విజేత దివ్య


ముగ్గు వేస్తున్న తృతీయ బహుమతి విజేత వి.అనూష


ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్


ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు సుప్రియానవీన్ గౌడ్, రవిచారి, పావని వినయ్‌కుమార్ తదితరులు


ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు సాయిప్రసన్న, శైలజ


ఆంధ్రజ్యోతి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు


బహుమతుల ప్రదానోత్సవ సభలో ..

మహిళలను ప్రోత్సహిస్తున్న ఆంధ్ర



ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ మహిళలను ప్రోత్సహించే విధంగా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయం.

నాలుగు సంవత్సరాలుగా ప్రథమ బహుమతి పొందుతున్నాను. చాలా సంతోషంగా ఉంది. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీలో ప్రథమ స్థానం పొందాలని ఆశిస్తున్నా.

- ఇందూరి వనజ, టీచర్, ప్రథమ బహుమతి విజేత

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేల జీవన భృతి ఇవ్వాలి

● రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్

కవాడిగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేల జీవనభృతిని ప్రకటించాలని, ఆటోమోటార్ రవాణా కార్మికులకు ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద ఆటో డ్రైవర్ల ఆరాటం, ఆకలికేకల పోరాటం పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాన్ని అందిస్తూ ఉపాధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆటో డ్రైవర్ల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటోడ్రైవర్లు రాష్ట్ర వ్యాప్తంగా తమ కార్యాచరణ ప్రకటించి, ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనీస వేతనాల బోర్డు చైర్మన్ పి.నారాయణ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్, తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, స్కూల్‌వ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పోలే నిరంజన్, మినిమంవేజ్‌బోర్డు సభ్యులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష స్పందన

కవాడిగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పది సంవత్సరాల సుపరిపాలనలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలన్న ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాత్ర ఇన్‌చార్జి బి చంద్రమోహన్, ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం రమేష్‌రాం, బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసి మహేందర్‌బాబు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో దేశ వ్యాప్తంగా తిరుగుతున్న వాహనం ఆదివారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్‌కు వచ్చిన సందర్భంగా ప్రత్యేక వాహనానికి స్వాగతం పలికారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వారు అన్నారు. కార్యక్రమంలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు గంటా శ్రీనివాస్, బీజేపీ నేతలు తొలుపునూరి రమేష్‌గౌడ్, ఆకుల అశోక్, నర్సింహ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మా తల్లి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

● ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు


కమల (ఫైల్)

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మా అమ్మ మృతికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతిరాలి కుమారుడు జి.చాణిక్యయాదవ్ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుడు చాణక్య తెలిపిన వివరాల ప్రకారం.. నేను మా అమ్మ కమల(48)తో కలిసి రాంనగర్ జెమినికాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. చాణిక్య అక్క మౌనిక విదేశాలలో ఉంటుందని తెలిపారు. తండ్రి భిక్షపతి కొద్ది కాలం క్రితం చనిపోయారని చెప్పారు. మా తండ్రికి కొన్ని సంవత్సరాల క్రితం వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధురానగర్‌లో గల ఓపెన్ ప్లాటు ఉందని తెలిపారు. ఆ ప్లాటు పక్కన నివాసం ఉంటున్న సందీప్, ఉదయ్‌లు ఆ ప్లాట్‌ను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకుని డిసెంబర్ 14న అడగ్గా వారు మా అమ్మను చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. దీంతో తాము అదే రోజు వారిపై వారసీగూడపీఎస్‌లో చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి బెదిరింపులతో మా అమ్మ మానసిక ఒత్తిడికి గురవుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల ఒత్తిడికి గురై స్పృహతప్పి ఇంట్లో ఈనెల 31న ఇంట్లో రాత్రి పడిపోగా ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా ఆమె చికిత్స పొందుతూ ఈనెల 5న మృతిచెందిందని తెలిపారు. సోదరి విదేశాల నుంచి రావడం కోసం ప్రస్తుతం మృతదేహాన్ని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. తమ తల్లి ఒత్తిళ్లకు గురై చనిపోవడానికి ప్రధాన కారణం సందీప్, ఉదయ్‌లు పెట్టిన వేధింపులే కారణమని చాణక్య ఆరోపించారు. తమ తల్లి కమల మృతికి కారణమైన సందీప్, ఉదయ్‌లను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని చాణక్య కోరారు. వారి నుంచి తనకు ప్రాణభయం ఉందని వారినుంచి రక్షణ కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్‌రెడ్డి వివరణ ఇస్తూ చాణక్య ఇచ్చిన ఫిర్యాదును విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సభలో మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

● టీపీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి ఆరోపించా రు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ధర్మ టీచర్స్ యూనియన్ ఆవిర్భావ సభ సంస్థ ప్రతినిధి ఆశన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుతమున్న ఉపాధ్యాయ సంఘాల ఎజెండాలకు భిన్నంగా నూతన ఎజెండాతో బీసీ, ఎస్సీ, ఎస్టీ అండ్ డీఎస్సీ ఉపాధ్యాయులతో ధర్మ టీచర్స్ యూనియన్ ఆవిర్భావం కావడం శుభపరిణామమన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేజీ టూ పీజీ నిర్బంధ విద్య అందని ద్రాక్షగా మారిందని, దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నించలేదన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ మనోహర్, డాక్టర్ విశారదన్ మహరాజ్, ఓయూ ప్రొఫెసర్ రామయ్య యాదవ్, సాదా అరుణ, లింగమయ్య యాదవ్‌లు మాట్లాడుతూ ధర్మ టీచర్స్ యూనియన్ ప్రస్తుతమున్న ఉపాధ్యాయ సంఘాల ఎజెండాలకు భిన్నంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పది ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలు దామెర ఉపేందర్, నాగరాము, ఎన్.రమేష్, పి.అశోక్. కె.రాజు, రవిచంద్రన్, బి.రవి, సుధాకర్, జనార్ధన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతల ఊరేగింపు

ముషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య శ్రీరామ అక్షింతల ఊరేగింపు ఆదివారం భోలక్‌పూర్‌లో నిర్వహించారు. పద్మశాలీకాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు, బీజేపీ నాయకులు నాగేందర్, బీఆర్ఎస్ నాయకుడు గోవింద్ తదితరులు అక్షింతలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లారు. మహిళలు హారతులు ఇచ్చి పూజలు చేశారు.



బర్కత్‌పుర : తార్నాకలోని శివాలయంలో అయోధ్య రామ పాదుకలు అక్షింతల పూజా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కె.అరుణ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మహిళామోర్చా ప్రధాన కార్యదర్శి కల్యాణం గీతారాణి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362